

1 నుంచి హెల్మెట్ తప్పనిసరి: ఎస్పీ శోభారాణి



బళ్లారి సిటీ, మే 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జూన్ 1 నుంచి ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్పీ శోభారాణి సూచించారు. గురువారం విలేకరులతో మాట్లాడిన ఆమె ఇటీవల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా నిబంధనలు కఠినతరం చేశామన్నారు. హెల్మెట్ ధరించకపోయినా, నిబంధనలు అతిక్రమించినా జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

కొబ్బరి.. లాభాల సిరి



గిటక కొబ్బరిని గ్రేడింగ్ చేస్తున్న రైతులు

- క్వింటం గిటక రూ.21వేలు
- రికార్డుస్థాయిలో ధర
- అన్నదాత హర్షం



బెంగళూరు, మే 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొబ్బరి పంట రైతులకు సిరులు పండిస్తోంది. రికార్డు స్థాయి ధరలతో అన్నదాత హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేశంలో కొబ్బరిని అత్యధికంగా సాగు చేసే రాష్ట్రాల్లో కర్ణాటక ఒకటి. రాష్ట్రంలో కల్పతరునాడుగా పిలిచే తుమకూరు, హాసన్, మండ్య జిల్లాల్లో కొబ్బరిసాగు అధికం. 2023-24లో రూ.726 కోట్ల టెంకాయలు ఉత్పత్తి అయ్యాయి. తర్వాతి స్థానంలో తమిళనాడు (578 కోట్లు), కేరళ (564 కోట్లు) ఉన్నాయి. హాసన్ జిల్లా అరసికెరెలోని ఏపీఎంసీ కొబ్బరిమార్కెట్‌లో క్వింటాల్ రూ.21వేలు దాటగా తిపటూరు మార్కెట్‌లో రూ.20,900 పలికింది. మార్కెట్‌లో ఒక్కసారిగా డిమాండ్ పెరగడం, ఏపీఎంసీ నియమాలలో మార్పు, దిగుబడి తక్కువగా ఉండడం వంటి కారణాలతో కొబ్బరి ధర పెరగడానికి కారణంగా ఉంది. కాగా మద్దతు ధర రూ.20వేలుగా నిర్ణయించాలని రైతులు కోరుతున్నారు. ఇదివరకు తమిళనాడు సహా దక్షిణభారత వ్యాప్తంగా ఇక్కడి మార్కెట్‌నుంచి ఎగుమతి అయ్యేది. ఇటీవల కొంతకాలంగా ఉత్తరభారత్‌లోనూ ఇక్కడికొబ్బరికి డిమాండ్ పెరిగింది. రాష్ట్రం నుంచి ఉత్పత్తయ్యే కొబ్బరిలో 30శాతం తుమకూరు జిల్లానుంచే ఉంది. తర్వాతిస్థానంలో హాసన్ ఉంది.

కొబ్బరి నిల్వలు తగ్గడమే కారణం

హాసన్ జిల్లా అరసికెరె తాలూకాలో కొబ్బరి రైతుల బతుకు పాము-నిచ్చెన ఆటలాంటింది. వర్షం, పంట ఉన్నప్పుడు మార్కెట్‌లో ధర ఉండదు, మంచి ధర పలికినప్పుడు రైతుల వద్ద పంట ఉండదు. వర్షపు కొరత, తగ్గిన భూగర్భజలాలు, పంటకు నుసిరోగం, ఇతరత్రా సమస్యలు వంటివి కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్నారు. కొన్ని నెలలుగా క్వింటాల్‌కు రూ.10వేలకు కాస్త అటూ ఇటుగా ధర ఉండేది. అయితే ఒక్కసారిగా రెట్టింపు ధర పలకడంతో కొబ్బరిరైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. కాగా నేషనల్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (నాఫెడ్) ద్వారా తక్కువరేటుకు కొబ్బరిని ఇచ్చారు. ప్రస్తుతం ధర అధికంగా ఉండడంతో తక్కువ రేటుకు ఇచ్చేందుకు సిద్ధంగా లేరు. మంగళవారం టెండరులో క్వింటాలుకు రూ.21,018 ధర పలికింది. గురువారం రూ.21,226గా ఉంది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి కొబ్బరి బోండాలు, టెంకాయల విక్రయాలకే ప్రాధాన్యం ఇవ్వడంతో గిటక కొబ్బరి నిల్వలు తక్కువగా ఉన్నాయి. ఇది కూడా ధర పెరిగేందుకు కారణమైందని చెప్పవచ్చు. కష్టపడి పండించినపంటను ఇప్పటికే రైతులు నాఫెడ్ కేంద్రాలకు ఇవ్వడంతో వారి వద్ద తగినంత నిల్వలు లేవు. పలు కారణాలతో మార్కెట్‌కు తగినంతగా కొబ్బరి రావడం లేదు. మరోవైపు మహారాష్ట్ర, ఢిల్లీ, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లలో కొబ్బరికి డిమాండ్ పెరిగిందని స్థానిక వ్యాపారులు అంటున్నారు. నీరావరి సౌలభ్యం లేకున్నా, ఎన్నో ఇబ్బందులు దాటుకుని పండించిన కొబ్బరి పంటను ఇప్పటికే తక్కువధరకే నాఫెడ్‌కు ఇచ్చేశారు. పంటంతా నాఫెడ్‌కు ఇచ్చాక ఇప్పుడు ధర రెట్టింపు పలుకుతోందని కొబ్బరి రైతు బైరేశ్ అభిప్రాయపడ్డారు. కొబ్బరి రైతులసంక్షేమం గురించి అధికారులకు, ప్రజాప్రతినిధులకు పట్టలేదన్నారు.

ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకోవాలి..

హావేరి జిల్లా రైతుసంఘం సంచాలకులు కనకాంచనహళ్ళి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ కాయ కొబ్బరి సహా రైతు పండించే ఏ పంట అయినా సరే మార్కెట్‌లో కనీస ధర లభించడంతో పాటు ధరల స్థిరీకరణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని కోరారు. అరసికెరె ఏపీఎంసీ మార్కెట్ కమిటీ కార్యదర్శి సిద్దరంగస్వామి మాట్లాడుతూ కొబ్బరి దిగుబడి తక్కువగా ఉండడం, మరోవైపు కొబ్బరినూనెకు డిమాండ్ పెరిగిందన్నారు. ఈ కారణాలతోనే కొబ్బరికి అనూహ్యమైన ధర పలికిందన్నారు. మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.



తిపటూరు ఏపీఎంసీ మార్కెట్

అద్భుతాలు.. సృష్టించాలి..!



ఆడగోడి పాఠశాల తరగతి గదిని పరిశీలిస్తున్న సీఎం సిద్దరామయ్య, మంత్రి మధు బంగారప్ప

- విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- విద్యా సంవత్సరం ప్రారంభోత్సవంలో సీఎం సిద్దరామయ్య



విద్యార్థులతో సీఎం కరచాలనం

బెంగళూరు, మే 29(ఆంధ్రజ్యోతి): ప్రతిభ ఎవరి సొత్తూ కాదని, అవకాశాలను వినియోగించుకుని అద్భుతాలు సృష్టించాలని సీఎం సిద్దరామయ్య విద్యార్థులకు సూచించారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా 2025-20 విద్యాసంవత్సరం ప్రారంభమైంది. నగరంలోని ఆడగోడి అయ్యప్ప గార్డెన్ పటేల్ మునిచెన్నప్ప హైస్కూల్‌లో విద్యాసంవత్సరాన్ని సీఎం సిద్దరామయ్య లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ.. ఆర్థికమంత్రిగా ఉన్నపుడు లక్షమంది ఉపాధ్యాయులను నియమించుకునేలా అనుమతులు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. పాఠశాలల్లో ఉత్తమ బోధనలు తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పాఠశాలల గదుల నిర్మాణాలు, మరమ్మత్తులకు రూ.725 కోట్లు కేటాయించామన్నారు. అందరికీ విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్య కేవలం విజ్ఞానం మాత్రమే ఇవ్వదని వ్యక్తిత్వాన్ని, నైతిక విలువలను రూపొందిస్తుందన్నారు. బాలబాలికలందరూ చదువుకోవాలని ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదన్నారు. అంబేడ్కర్ దేశం మెచ్చిన మహా మేధావి అన్నారు. అంబేడ్కర్ ఎదుగుదల ద్వారా ప్రతిభ ఎవరి సొత్తు కాదనేది గుర్తుంచుకోవాలన్నారు. ఎక్కువ భాషలు నేర్చుకోవాలని కన్నడలోనే ముందుకెళ్లాలన్నారు. గ్రేస్ మార్కులు లేకుండానే ఉత్తమ మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ బాగా చదివితే రాజులు అవుతారని లేదంటే జీవితకాలం సేవకులుగా మిగిలిపోతారన్నారు. ఎప్పుడూ రాజులు కావాలనే ఆలోచనతో ఉండాలన్నారు. నెలన్నర కాలంగా సెలవులను ఎంజాయ్ చేశారని ఇకపై చదువుపై దృష్టిపెట్టాలన్నారు. బాగల్‌కోటె మొరార్జీ దేశాయ్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థిని అంకితా ఎస్ఎస్ఎల్‌సీలో స్టేట్ టాపర్ కావడం సంతోషంగా ఉందన్నారు. బెళగావి రూపా పాటిల్‌తో పాటు తల్లిదండ్రులను అభినందిస్తున్నట్లు తెలిపారు. జ్ఞానాన్ని చిన్నప్పటి నుంచే పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖా మంత్రి మధు బంగారప్ప, మంత్రి రామలింగారెడ్డితోపాటు విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులతో జ్యోతి ప్రజ్వలన చేయిస్తున్న సీఎం, డీసీఎం

డీసీఎం..!

- సీఎం సిఫారసులపై మండిపడ్డ డీసీఎం డీకే
- జలవనరులశాఖ చీఫ్ ఇంజనీర్ల బదిలీలపై ఆగ్రహం
- ఉత్తర్వులు రద్దు చేయాలని సీఎస్‌కు లేఖ



బెంగళూరు, మే 29(ఆంధ్రజ్యోతి): సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ మధ్య మరోసారి వివాదం రాజుకుంది. జలవనరుల శాఖకు చెందిన ఐదుగురు చీఫ్ ఇంజనీర్లను బదిలీ చేయడంపై డీసీఎం డీకే శివకుమార్ మండిపడ్డారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య సిఫారసు మేరకే బదిలీలు చేపట్టారు. విషయం తెలిసిన తర్వాత డీసీఎం డీకే శివకుమార్ తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. తన శాఖలో తన ప్రమేయం లేకుండానే చీఫ్ ఇంజనీర్లను ఎలా బదిలీ చేస్తారని సన్నిహితుల వద్ద ఆగ్రహం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈనెల 13న నేరుగా చీఫ్ సెక్రటరీకి లేఖ రాసిన డీసీఎం బదిలీన రద్దు చేసి ఇంజనీర్లను యథావిధి స్థానాలకు పంపాలని కోరారు. ఇదే విషయమై చీఫ్ సెక్రటరీకి నేరుగాను సూచించినట్లు సమాచారం. డీపీఎఆర్ శాఖ ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తున్నారని సిఫారసు చేసిన మేరకే ఉత్తర్వులు జారీ చేసినట్లు చీఫ్ సెక్రటరీ వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. కాగా తన శాఖకు సంబంధించిన ఉద్యోగుల బదిలీలు, నియామకాల విషయంలో తన ప్రమేయంలేకుండా చేయరాదని రెండేళ్ల క్రితం మంత్రిగా బాధ్యతలు స్వీకరించినపుడే సర్క్యులర్ జారీ చేసిన విషయాన్ని ప్రస్తావించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో జలవనరుల విభాగంలో కొందరు ఇంజనీర్లకు కీలకమైన పనులు అప్పగించిన వేళ బదిలీలు చేస్తే ఎలాగని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. వివాదం ఎక్కడిదాకా వెళుతుందో అనే ఉత్కంఠ పార్టీలో నెలకొంది.

విభజించడం.. ఎలా..?



- గ్రేటర్ బెంగళూరుకు తీవ్రమైన హద్దుల సమస్య
- వేర్వేరు పాలికెల్లో నియోజకవర్గ పరిధి
- వార్డుల విభజనలోనూ తప్పని తలనొప్పి
- మూడు పాలికెలతోనే సమస్యకు పరిష్కారం..!

బెంగళూరు, మే29(ఆంధ్రజ్యోతి): ఐటీ రాజధాని బెంగళూరుకు 'గ్రేటర్' పేరిట కొత్త రూపుతెచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం సన్నద్ధమైంది. ఇందుకోసం గ్రేటర్ బెగళూరు పాలనా చట్టాన్ని ప్రధానంగా ఉపయోగించుకోదలిచింది, కొత్త పాలికెల ఏర్పాటు, వాటికి సరిహద్దులు నిర్ణయించడం పెద్ద సవాల్‌గా మారింది. బీబీఎంపీకి ప్రత్యామ్నాయంగా గ్రేటర్ బెంగళూరు గవర్నన్స్ యాక్ట్ (జీబీజీఏ) అమలుకోసం ఈనెల 15న లాంఛనంగా ప్రారంభించింది. నాలుగు నెలల్లో పూర్తి చేయాలని గడువు విధించింది. పూర్తిస్థాయి పాలకవర్గం అందుబాటులో వచ్చేంతవరకు ప్రస్తుత వ్యవస్థనే కొనసాగనుంది. ఇందుకోసం సమితి ఒకటి ఏర్పాటైంది తద్వారా కొత్త పాలికెల ఏర్పాటు వీలు కానుంది. ఎన్ని పాలికెలు ఏర్పాటు చేయాలి, వాటి స్వరూపం, విస్తరణ, హద్దులు, జనాభా, పాల, ఆర్థిక అంశాలతో పాటు ఇతరత్రా వాటిని పరిగణించి నివేదిక సిద్ధం చేసేందుకు కసరత్తు ప్రారంభమైంది. ఈ సమితి స్వతంత్రంగా పనిచేయనుంది. గడువులోగా నివేదిక రూపొందించాల్సి ఉంది. ప్రస్తుత ప్రభుత్వానికి ఇన్ని పాలికెలు కావాలని స్పష్టం చేయలేదు. 3 లేదా 5 పాలికెలపైకి ఏ తరహా ఎంపిక చేయాలనేది ప్రభుత్వానికి ఆసక్తి ఉంది.

ఒకే పాలికెలోనే శాసనసభ నియోజకవర్గ పరిధి

కొత్తగా ఏర్పాటయ్యే పాలికెల పరిధిలోకి శాసనసభ నియోజకవర్గాల ప్రదేశం పూర్తిగా చేరాలని ఎమ్మెల్యేల డిమాండ్‌గా ఉంది. తద్వారా ఆయా పాలికెల ద్వారా తమ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యేలు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ 2-3 పాలికెలకు పంచుకున్నట్టయితే ఎన్నికలపై ప్రభావం చూపనుంది. ప్రస్తుతం నగరంలో 28 శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో రాజరాజేశ్వరినగర్ (ఆర్ఆర్‌నగర్), బెంగళూరు దక్షిణ, బొమ్మనహళ్ళి, మహదేవపుర నియోజకవర్గాలు విస్తరణలోనూ, జనాభాలోనూ పెద్ద నియోజకవర్గాలుగా గుర్తింపు పొందాయి. వీటిపైకి ఆర్ఆర్‌నగర్, మహదేవపుర నియోజకవర్గాలు ఒకే పాలికెగా చేర్చడం కష్టం కానుంది.

ప్రధాన సవాళ్లు ఇవే...

- కొత్త పాలికెకుల పాలనలో ఇవ్వాల్సిన అధికారాలు.
- బీబీఎంపీ పరిధిలో కొత్త ప్రాంతాల చేరిక
- ఒక నియోజకవర్గాన్ని ఒకే పాలికె పరిధిలోకి తేవడం
- వార్డుల విభజనలో జనాభాకు అనుగుణంగా ఏకరూపత
- ఆదాయ వనరుల క్రోడీకరణ, గ్రాంట్ల కేటాయింపులలో సారూప్యం
- పాలికెలవారీ అధికారి, సిబ్బంది నియామకం
- మౌలిక సదుపాయాలకై గ్రాంట్ల విడుదల
- కొత్త పాలికెలకు ఆస్తులు/సమాన భవనాల కేటాయింపు



వార్డుల విభజన సైతం కఠినతరం

ప్రస్తుతం బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) పరిధిలో 198 వార్డులు ఉన్నాయి. వీటిని గతప్రభుత్వం 225కు పెంచింది. గ్రేటర్ బెంగళూరు కింద కొత్త పాలికెలలో సుమారు 400 వార్డులు అయ్యే అవకాశం ఉంది. అందుకు గాను 3 పాలికెలను ఏర్పాటు చేయదలిచారు. గరిష్ఠంగా 150కు మించకుండా 125-135 వార్డులను రూపొందించదలిచారు. అయితే జనాభాకు సమానంగా కేటాయింపులు చేయడం కష్టం కానుంది. ఇందుకుగాను పెద్ద వార్డు ఏర్పాటు చేస్తే తగిన గాత్రం ఉంటుంది. చిన్నవార్డును రూపొందిస్తే జనాభా పరిమితిని నిర్ధారించడానికి పెద్ద సవాల్ కానుంది.

మూడు పాలికెల ఏర్పాటుకు సలహా

గ్రేటర్ బెంగళూరు బ్రాండ్ బెంగళూరు నగర, గ్రామీణ, రామనగర (ప్రస్తుతం బెంగళూరు దక్షిణ) జిల్లాలకు పేరుబలం లభించనుంది. అయితే కొత్త పాలికెల పరిధి గత బీబీఎంపీ ప్రదేశమే ఉండాలని పలువురు ముఖ్యమంత్రికి సలహా ఇచ్చారు. దీనిపై ముఖ్యమంత్రి కూడా సానుకూలం వ్యక్తం చేశారు. బీబీఎంపీని మూడు పాలికెలుగా విభజించడం ద్వారా పాలన సులభం కానుందనే మాటలు వినిపిస్తున్నాయి. 198వార్డుల బీబీఎంపీ పరిధిలో కోర్ ఏరియా (నగర మధ్యప్రదేశం)ఒక పాలికెగా ఏర్పాటు చేసే ఆలోచన ఉంది. ఇందులో ఇదివరకు ఉన్న బెంగళూరు మహానగర పాలికె (బీఎంపీ) 100వార్డుల కంటే ఎక్కువ ప్రదేశం వచ్చే అవకాశం ఉంది. ఇందుకు అనుబంధంగా మిగిలిన రెండు పాలికెలను ఏర్పాటు చేసుకునే అవకాశం. ఉంది. ఈ తరహాలో మూడు పాలికెలు ఏర్పాటు చేసినా సరిహద్దు సమస్య తలెత్తే అవకాశం ఉంది. దీనికి తోడు కొత్త పాలికెల ప్రదేశాన్ని అందరూ ఒప్పుకోవాల్సి ఉంటుంది. అయితే కోర్ ఏరియా గతంలోని తూర్పు, పశ్చిమ, దక్షిణ వలయాలను కలుపుకొంటూ వెళ్తే ఇప్పటికే చాలాప్రాంతం అభివృద్ధి చెంది ఉండడం ద్వారా కొత్త రూపంలో 'సూపర్ పాలికె'గా అవతరించే అవకాశం ఉంది.



నేల మఠం..!

- లోకేశ్వర స్వామి మఠాన్ని కూల్చేసిన అధికారులు
- బాలికపై అత్యాచార ఆరోపణలపై భక్తుల ఆగ్రహం

బెంగళూరు, మే 29(ఆంధ్రజ్యోతి): నిన్న, మొన్నటిదాకా అపారమైన నమ్మకంతో పూజలందించిన భక్తులు నేడు భగ్గుమంటున్నారు. రోగాలు నయం చేస్తారంటూ క్యూ కట్టిన భక్తులు నేడు ఆయనకిదేమీ రోగం అంటూ శాపనార్థాలు పెడుతున్నారు. రెండు రోజుల క్రితమే మఠం లోని సామాన్లు పట్టుకెళ్లిన భక్తులు మఠాన్ని సైతం కూల్చేశారు. మైనర్ బాలికను కిడ్నాప్ చేసి మూడు రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో తిప్పుతూ అత్యాచారానికి పాల్పడిన లోకేశ్వర స్వామి మఠాన్ని అధికారులు పూర్తిగా ధ్వంసం చేశారు. బెళగావి జిల్లా చిక్కోడి తాలూకా మేఖళి గ్రామంలో ఓ మందిరాన్ని ఏర్పాటు చేసుకుని స్వయంఘోషిత స్వామీజీగా లోకేశ్వర వ్యవహరిస్తుండేవారు. జబ్బులు నయం చేస్తానని నమ్మించేవారు. బెళగావితో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు మఠానికి వచ్చేవారు. ఇటీవల మైనర్ బాలికపై అత్యాచారం కేసులో లోకేశ్వర స్వామి అరెస్టు అయ్యారు. మరుసటి రోజున స్థానికులు వాహనాలు, ట్రాక్టర్లు తీసుకువచ్చి మఠంలోని ఫర్నిచర్స్‌తో పాటు అన్ని వస్తువులను తరలించుకు వెళ్లారు. తాజాగా సదరు మఠం గోమాళ భూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించారని నిర్ధారించిన తహసీల్దారు స్థానిక పోలీసు అధికారుల సమక్షంలో భారీ యంత్రాల ద్వారా మఠాన్ని పూర్తిగా ధ్వంసం చేయించారు. రెవెన్యూ భూమిలో ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని బోర్డులు ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా అమాయకులను నమ్మించి మోసం చేసిన స్వామీజీకి తగిన గుణపాఠం జరిగిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



నేలమట్టమయిన లోకేశ్వర స్వామీజీ మఠం

రేపటి నుంచి దివ్యదర్శనం ప్రారంభం

- నగరం చుట్టుపక్కల దేవస్థానాల సందర్శనకు బీఎంటీసీ స్పెషల్ ప్యాకేజీ
- ప్రత్యేక బస్సులను ప్రారంభించిన రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి

బెంగళూరు, మే 29(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరాన్ని సందర్శించేవారి కోసం బీఎంటీసీ బస్సుల ద్వారా దివ్యదర్శన ప్యాకేజీ టూర్‌ను శ్రీకారం చుట్టింది. ప్రతి శనివారం, ఆదివారంతో పాటు సెలవు రోజుల్లో ప్రత్యేక ప్యాకేజి బస్సులు అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతం అమలులో ఉండే బెంగళూరు దర్శిని, ఈషా ఫౌండేషన్ స్పెషల్ ప్యాకేజీలతో సంబంధం లేకుండా దివ్యదర్శన టూర్‌లు అందుబాటులో ఉంటాయి. దివ్యదర్శన్ ప్యాకేజీలో మైసూరు రోడ్ గాలి అంజనేయస్వామి, రాజరాజేశ్వరీ దేవాలయం, శృంగేరి షణ్ముక స్వామి గుడి, శ్రీదేవి కరుమారి అమ్మ దేవాలయం, ఓంకార్‌హిల్స్, ఇస్కాన్ వైకుంఠ దేవాలయం, ఆర్ట్‌ఆఫ్ లివింగ్ శ్రీ రవిశంకర గురూజీ ఆశ్రమం, బనశంకరి దేవాలయాల దర్శనాలు జరుపుతారు. పిల్లలకు రూ.350 కాగా పెద్దవారికి రూ.450గా టికెట్ ధరలు నిర్ణయించారు. కేఎస్ఆర్టీసీ, బీఎంటీసీల వెబ్‌సైట్ ద్వారాను టికెట్‌లు ముందుగా రిజర్వు చేసుకునే వెసలుబాటు ఉంది.



బస్సును ప్రారంభిస్తున్న రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి




సభలో అమ్మాయిల ఉత్సాహం


మహానాడు వేదిక


సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు









మహా జాతర

కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్ర్కీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీకి జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం



మెడలో టవాలు.. రబ్బరు చెప్పులు..

రోగి సంబంధికుడిలా

ఆస్పత్రికి కలెక్టర్

- అరగంటపాటు తనిఖీ
- రోగులతో వైద్యంపై ఆరా
- పలు లోపాలను గుర్తించి డీసీహెచ్ఎస్‌కు ఆదేశాలు


ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న కలెక్టర్

గుంతకల్లు/గుంతకల్లు టౌన్, మే29(ఆంధ్రజ్యోతి): మూతికి మాస్క్, మెడలో టవాలు, కాళ్లకు రబ్బరు చెప్పులు వేసుకుని, బుధవారం రాత్రి గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి ఓ వ్యక్తి వచ్చారు. ఆస్పత్రి అంతా కలియతిరిగారు. సెక్యూరిటీ, రోగులతో మాట్లాడారు. వైద్య సేవలపై ఆరాతీశారు. వార్డులన్నీ పరిశీలించారు. అరగంట తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆయన ఎవరన్నది ఆ రాత్రి ఎవరూ గుర్తించలేదు. మరుసటి రోజుగానీ తెలియలేదని ఆయన స్వయానా జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ అని. ఎవరూ గుర్తుపట్టని వేషధారణతో ఆయన ఆస్పత్రిని తనిఖీ చేశారు. పలు నిర్వహణాలోపాలను కలెక్టర్ గుర్తించి, తగిన విధంగా చర్యలు తీసుకోవాలంటూ డీసీహెచ్ఎస్ రవికుమార్‌ను ఆదేశించారు. రాత్రి 10.30 గంటల సమయంలో రోగి సంబంధీకుడినంటూ మాస్కు ధరించిన కలెక్టర్ గుంతకల్లు ఏరియా ఆస్పత్రికి వచ్చారు. క్యాజువాలిటీలో డాక్టర్ ఉన్నారా, లేరా? అని పరిశీలించారు. లేబర్ వార్డుకెళ్లారు. ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుల పనితీరును గమనించారు. ఆస్పత్రిలో నిలిపిన ప్రైవేటు అంబులెన్స్ ఉండగా, దాని నిర్వాహకులతో మాట కలిపి వివరాలను తెలుసుకున్నారు. రోగిని అనంతపురం తీసుకెళ్లడానికి అంబులెన్స్‌కు ఎంతవుతుందని అడగ్గా.. రూ.5,500 తీసుకుంటామని వారు తెలిపినట్లు సమాచారం. ఆక్సిజన్ లేని అంబులెన్సుకు ఎంత అవుతుందని కలెక్టర్ ఆరాతీశారు. ఆక్సిజన్ ఉన్నా.. లేకపోయినా అంతే అవుతుందని సమాధానమిచ్చినట్టు తెలిసింది. ఆస్పత్రిలో పలు అంశాలను తనిఖీచేసిన కలెక్టర్ అరగంట తర్వాత వెనుదిరిగి వెళ్లిపోయారు. గురువారం సూపరింటెండెంట్, ఇతర అధికారులను అనంతపురానికి పిలిపించి, ఆస్పత్రిలో తాను గమనించిన లోపాలపై ప్రశ్నించినట్లు సమాచారం. సెక్యూరిటీ గార్డులు ప్రవేశ ద్వారం వద్ద కనిపించలేదనీ, ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణ సరిగాలేదనీ, మరుగుదొడ్లు హైజీనిక్‌గా లేవని నిలదీసినట్లు తెలిసింది. ప్రైవేటు అంబులెన్స్‌లను ఆస్పత్రిలోకి ఎందుకు అనుమతించారనీ, వారు అధిక మొత్తాలను చార్జ్ చేస్తున్నారని మండిపడ్డారని సమాచారం. ఆస్పత్రి సిబ్బంది.. రోగులను ప్రైవేటు నర్సింగ్ హోంలకు వెళ్లేలా ప్రోత్సహిస్తున్నారనీ, ఆస్పత్రికి చెందిన అంబులెన్స్‌ను ఎందుకు రన్నింగ్ కండిషన్‌లో ఉంచలేదంటూ ప్రశ్నల వర్షం కురిపించినట్లు ఆస్పత్రి వర్గాల ద్వారా తెలిసింది. ఆయా లోపాలపై చర్యలు తీసుకోవాలంటూ డీసీహెచ్ఎస్‌కు కలెక్టర్ లెటర్ పంపారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి హెచ్చరిక



అనంతపురం టౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): గర్భస్థ శిశువు లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ ఈబీ దేవి గురువారం హెచ్చరించారు. స్కానింగ్‌కు వచ్చిన గర్భిణుల నుంచి వైద్యుల రెఫరెన్స్ రసీదును తీసుకుని ఫైల్ చేసుకోవాలని స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు సూచించారు. లింగ నిర్ధారణ కోసం ఆర్ఎంపీలు గర్భిణులను స్కానింగ్‌కు పంపుతున్నారని, పద్ధతి మానుకోవాలని హెచ్చరించారు. ఆర్ఎంపీలు పంపిన గర్భిణులకు స్కానింగ్ చేయొద్దని సెంటర్ల నిర్వాహకులకు సూచించారు. గర్భిణులకు అవసరమైన వైద్య పరీక్షలను ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిరంతరం చేస్తారని అన్నారు. మాతాశిశు మరణాలను అరికట్టేందుకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే 08554-228234 నంబరుకు సమాచారం ఇవ్వాలని డీఎంహెచ్ఓ కోరారు.

ముందుగా మేల్కోండి..!

- త్వరలో విద్యా సంవత్సరం ఆరంభం
- అవసరమైన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి
- హడావుడి కన్నా ముందస్తే మేలు అంటున్న అధికారులు



చిలమత్తూరు సచివాలయం

చిలమత్తూరు, మే 29(ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరం ఆరంభం అయ్యేలోపు విద్యార్థులు వారి ఉన్నత విద్యా ప్రవేశానికి అవసరమైన సర్టిఫికెట్లు సిద్ధం చేసుకుంటే మంచిదని ఉపాధ్యాయులు, అధ్యాపకులు సూచిస్తున్నారు. సర్టిఫికెట్ల మంజూరులో జాప్యం జరిగితే విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది. అందుకే అవసరమైన సర్టిఫికెట్ల కోసం ముందుగానే దరఖాస్తు చేసుకుంటే మేలని చెబుతున్నారు. ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, పాలిటెక్నిక్, ఎంబీఏ, ఎంసీఏ ఇలా ఏ కోర్సులో ప్రవేశానికైనా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పలు సర్టిఫికెట్లు అవసరమవుతాయి. కుల, ఆదాయ, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ వంటి ధ్రువీకరణ పత్రాలు అవసరం ఉంటాయి. ఇంటర్మీడియేట్, డిగ్రీ, ఐటీఐ వంటి కోర్సుల్లో ప్రవేశం పొందే విద్యార్థులు ముందుగానే పత్రాలను సిద్ధం చేసుకోవడం వల్ల ఒత్తిడి లేకుండా నూతన కోర్సుల్లో ప్రవేశం పొందే వీలుంటుంది. అవసరమైన ధ్రువపత్రాల కోసం సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు.

అవసరమైన సర్టిఫికెట్లు ఇవే..

ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియేట్, డిగ్రీ, ఐటిఐ వంటి కోర్సుల్లో ప్రవేశానికి కొందరు విద్యార్థులకు కులం, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ సర్టిఫికెట్లు, ఆదాయం వంటి ధ్రువపత్రాలు అవసరం అవుతాయి. వీటిని పొందాలంటే ఆధార్, రేషన్ కార్డు, విద్యార్హతకు సంబంధించిన జిరాక్సు పత్రాలను జత జేసి సచివాలయాల్లో అందజేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన పత్రాలను సంబంధిత వార్డు, గ్రామ వీఆర్వోలు పరిశీలించి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు అందిస్తారు. ఆర్ఐ పరిశీలన పూర్తయ్యాక తహసీల్దార్ లాగిన్‌కు వెళుతుంది. తహసీల్దార్ లాగిన్‌లో పరిశీలన చేసి డిజిటల్ సైన్ చేస్తారు. అనంతరం ధ్రువపత్రాలు మంజూరైన సమాచారం మనం ఇచ్చిన మొబైల్‌కు సమాచారం వస్తుంది. తదుపరి మనం దరఖాస్తు చేసుకున్న సచివాలయాలు, మీసేవ కేంద్రాల వద్దకు వెళ్లి పత్రాలను పొందవచ్చు.

అత్యవసరమైనపుడు నిబంధనలు ముందుకు..

సాధారణంగా మండల, గ్రామ స్థాయిలో ధ్రువీకరణ పత్రాలు కావాల్సినప్పుడు కొందరు అధికారులు పని ఒత్తిడో మరే ఇతర కారణంతోనో పత్రాల మంజూరులో జాప్యం చేయడానికి నిబంధనలు ముందుకు తెస్తారు. నిబంధనల ప్రకారం ఆదాయ ధ్రువీకరణ పత్రం మంజూరు చేయడానికి పది రోజుల సమయం ఉంటుంది. కుల, ఆదాయ, నివాసం మూడు కలిగిన ధ్రువ పత్రానికైతే 30 రోజుల వ్యవధి ఉంటుంది. తొందరగా సర్టిఫికెట్ అవసరమని ఒత్తిడి తెస్తే అధికారులు సిటిజన్ చార్ట్‌లో ఉన్న నిబంధనలు ముందుకు తెస్తూ ఉంటారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా దరఖాస్తు చేసుకోవడం వలన అధికారులు కూడా నిబంధనల ప్రకారం ధ్రువీకరణ పత్రాలు ఇవ్వక తప్పదు.

ఇబ్బందులు ఉంటాయి



అవసరమైన సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు ఇప్పటి నుంచే మీసేవ, సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే మంచిది. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమైనప్పుడు ఒకే సమయంలో వేలమంది విద్యార్థులు ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటారు. దాంతో వాటిని పరిశీలించడానికి ఇబ్బందులు ఎదురవుతాయి. ఒకేసారి వేల సంఖ్యలో దరఖాస్తులు ఆన్‌లైన్లో అప్‌లోడ్ కావడంతో సర్వర్ సమస్య కూడా తలెత్తవచ్చు. ముందుగా దరఖాస్తు చేసుకుంటే దరఖాస్తుల పరిశీలనకు కూడా అధికారులకు అవకాశం ఉంటుంది. దీనిని గుర్తుంచుకొని కావాల్సిన సర్టిఫికెట్ల కోసం ఇప్పటి నుంచే దరఖాస్తు చేసుకుంటే మంచిది. - జగన్నాథం, డీటీ, చిలమత్తూరు

టెన్షన్ ఉండదు



త్వరలో విద్యా సంవత్సరం మొదలవుతోంది. తల్లిదండ్రులు పిల్లలకు సంబంధించిన నివాసం, కులం వంటి ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలి. ఇటీవల పదోతరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన వారు ఉన్నత చదువులకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ తరుణంలో వారికి అన్ని రకాలు సర్టిఫికెట్లు చాలా అవసరం ఉంటుంది. అందుకోసం విద్యార్థులు సర్టిఫికెట్లు కోసం ముందుగానే దరఖాస్తు చేసుకోవడం మంచిది. సకాలంలో సర్టిఫికెట్లు అందితే కళాశాలలకు వెళ్లే విద్యార్థులు హడావుడి పడాల్సిన పని ఉండదు.

- సల్మాన్ రాజ్,
ఎంఈఓ, చిలమత్తూరు

ఆస్పత్రుల్లో భోజన సరఫరాకు టెండర్లు

● 6 వరకు గడువు ● డీసీహెచ్ఎస్ రవికుమార్ వెల్లడి

అనంతపురం టౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైద్యవిధాన పరిషత్ పరిధిలోని ప్రభుత్వాస్పత్రుల్లో రోగులు, డ్యూటీ డాక్టర్లకు భోజనం సరఫరాకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ రవికుమార్ గురువారం తెలిపారు. వైద్యవిధాన పరిషత్ పరిధిలో ఉమ్మడి జిల్లాలో హిందూపురం (జిల్లా ఆస్పత్రి), తాడిపత్రి, గుంతకల్లు, మడకశిర, కదిరి, ధర్మవరం ప్రాంతీయ ఆస్పత్రులు, ఉరవకొండ, కళ్యాణదుర్గం, గుత్తి, పెనుకొండ, కొనకొండ్ల, శింగనమల, కణేకల్లు, పామిడి, చెన్నేకొత్తపల్లి, తనకల్లు, కొత్తచెరువు,గోరంట్ల, నల్లమాడ, రొళ్ల (సామాజిక ఆరోగ్యకేంద్రా(సీహెచ్‌సీలు)ల్లో భోజన సరఫరాకు టెండర్లు స్వీకరిస్తున్నామన్నారు. ఆసక్తిగలవారు జిల్లా ఆస్పత్రికి రూ.3వేలు, ప్రాంతీయ ఆస్పత్రులకు రూ.2వేలు, సామాజిక ఆరోగ్యకేంద్రాలకు రూ.1000 చొప్పున డీడీ చెల్లించి, దరఖాస్తుకు కలిపి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. జూన్ 6వతేదీలోగా దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందన్నారు.

133 మంది గ్రేడ్-2 హెచ్ఎంల బదిలీ

అనంతపురం విద్య, మే 29(ఆంధ్రజ్యోతి): టీచర్ల బదిలీల్లో భాగంగా గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులకు బదిలీ ఉత్తర్వులు గురువారం ఉదయం జారీ అయ్యాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 133 మంది బదిలీ అయ్యారు. జోన్-4 కడప ఆర్జేడీ శామ్యూల్ పేరుతో ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇటీవల జిల్లాలో 191 మంది ప్రధానోపాధ్యాయ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. 28 మంది తప్పనిసరి, 163 మంది రిక్వెస్టు కింద దరఖాస్తు చేశారు. స్ర్కూటినీ తర్వాత వారికి ఉదయం నుంచే బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా 191 మందిలో 133 మందికి స్థానచలనం కల్పించారు. 58 మందికి అవకాశం దక్కలేదు.

మరో రోజు..!

- సూపర్ స్పెషాలిటీలో ఓపీ పెంపు
- ఒక్కో విభాగం ఆధ్వర్యంలో మూడు రోజులు సేవలు
- 2 నుంచి అమలులోకి..

అనంతపురం టౌన్, మే29(ఆంధ్రజ్యోతి): స్థానిక శారదానగర్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఇకపై మూడు రోజులపాటు రోగులకు ఓపీ సేవలు అందించనున్నట్లు సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు. అనంతరం డాక్టర్లతో సమీక్షించారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఒక్కో వైద్యవిభాగం వారంలో రెండ్రోజులు మాత్రమే రోగులకు ఓపీ సేవలు అందిస్తోందన్నారు. మరోరోజు అదనంగా ఓపీ సేవలు అందించాలని నిర్ణయించామన్నారు. ఈలెక్కన వారంలో మూడురోజులు ఆయా వైద్య విభాగాలు ఓపీ సేవలు అందిస్తాయన్నారు. జూన్ రెండో తేదీ నుంచి అమలు చేస్తామన్నారు.

కొత్త షెడ్యూల్ మేరకు ఓపీ సేవలు ఇలా..

వైద్య విభాగాలు	ఓపీ నిర్వహణ రోజులు
న్యూరోసర్జరీ, గ్యాస్ట్రో, సీటీవీఎస్	సోమ, గురు, శనివారం
కార్డియాలజీ, న్యూరాలజీ, యూరాలజీ	మంగళ, బుధ, శనివారం
నెఫ్రాలజీ, ఎండోక్రొనాలజీ, పీడియాట్రిక్ సర్జరీ	సోమ, బుధ, శనివారం

విత్తనాలు, ఎరువుల కొరత రాకూడదు

అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలు


మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బుక్కరాయసముద్రం, మే 29(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు, ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని దయ్యాలకుంటపల్లి వద్దనున్న వెంకటాపురం జడ్పీ పాఠశాలలో ఖరీఫ్ సన్నద్ధతపై వ్యవసాయ శాఖ, ఏపీ సీడ్స్, మార్క్‌ఫెడ్ అధికారులతో కలెక్టర్ గురువారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయా మండలాలకు అవసరమైన మేర విత్తనం, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. విత్తనాలు నాణ్యతలేకపోతే వెనక్కివ్వాలని రైతులుకు సూచించారు. ఎరువుల నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. రైతు సేవాకేంద్రాల్లో 100శాతం క్యూఆర్ కోడ్ ద్వారా నగుదు రైతులు చెల్లించే విధంగా చూడాలన్నారు. విత్తన శుద్ధిని వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఏపీ సీడ్స్ డీఎం సుబ్బయ్య, మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి, ఏఓ శ్యాంసుందర్ రెడ్డి పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

జగ్మోహన్ దాల్మియా (జయంతి)



అభిమానులచే జగ్గు దాదా అని పిలవబడే జగ్మోహన్ దాల్మియా 1940 మే 30న కోల్కత్తాలో జన్మించారు. చిన్నతనం నుంచి క్రికెట్‌పై ఆసక్తి కల్గిన ఆయన కాలేజీ రోజుల్లో బ్యాట్స్‌మన్‌గా, వికెట్ కీపర్‌గా రాణించారు. అయితే జాతీయ స్థాయిలో ఆడే అవకాశం రాలేదు. కానీ క్రీడపై పట్టు కల్గిన ఆయన క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్‌కు అధ్యక్షుడిగా, బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఆఫ్ క్రికెట్ ఇన్ ఇండియా (బీసీసీఐ)కు అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్‌కు అధ్యక్షుడిగా కూడా పని చేశారు. 1987లో దేశంలో వరల్డ్‌కప్ నిర్వహించేలా చేయడంలో కీలకపాత్ర పోషించారు. నష్టాలలో ఉన్న బీసీసీఐను ప్రపంచంలో ధనవంతులుగా తీర్చడంలో ఎంతో కృషి చేశారు. వ్యాపారవేత్తగాను రాణించారు. ప్రపంచంలో టాప్ 6 స్పోర్ట్స్ ఎగ్జిక్యూటివ్స్‌లో ఒకరిగా బీబీసీచే కీర్తించబడ్డారు. 2015 సెప్టెంబరు 20న కన్నుమూశారు.

ఎల్‌బీ శ్రీరామ్ (పుట్టినరోజు)



తెలుగు సినీరంగంలో గోదారి యాసలో మాట్లాడుతూ ఆకట్టుకున్న నటులలో ఎల్‌బీ శ్రీరామ్ ఒకరు. పూర్తి పేరు లంక భద్రాద్రి శ్రీరామచంద్ర మూర్తి. 1952 మే 30న జన్మించారు. నటుడు, కమెడియన్, రచయిత, నిర్మాతగా రాణించారు. నాటక రంగం నుంచి వచ్చి వెండితెరపై సత్తా చాటుకున్నారు. లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ క్రియేషన్స్ అనే సొంత ప్రొడక్షన్ హౌస్ కలిగారు. 1990లో కోకిల సినిమా ద్వారా వెండితెరకు పరిచయం అయ్యారు. సుమారు 500 సినిమాల్లో విభిన్న పాత్రల్లో నటించారు. 5 నంది అవార్డులు అందుకున్నారు. బుల్లితెరపై 'అమృతం', సీక్వెల్ 'అమృతం ద్వితీయం'లో ఆంజనేయులు పాత్రతో ఎంతో గుర్తింపు పొందారు.

బీకే హరిప్రసాద్ నివాసానికి ముఖ్యమంత్రి



బీకే హరిప్రసాద్‌తో చర్చిస్తున్న సిద్ధరామయ్య

బెంగళూరు, మే 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్‌నేత బీకే హరిప్రసాద్ నివాసానికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వెళ్లారు. గురువారం ఉదయం హరిప్రసాద్ నివాసానికి వెళ్ళిన సీఎం సుమారు గంటసేపు గడిపారు. ఇద్దరి మధ్య తాజా రాజకీయ అంశాలతో పాటు ప్రభుత్వం, అధిష్ఠాన విధానాలపైనా చర్చలు జరిగినట్లు సమాచారం. అనంతరం సీఎం సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడుతూ ఇటీవలే హరిప్రసాద్ ఇంటికి రావాలని ఆహ్వానించారని అందుకే వచ్చానన్నారు. పలు అంశాలపై చర్చలు జరిగాయన్నారు. మంగళూరులో ఇటీవల వరుసహత్యలు జరుగుతుండటం పైనా ప్రస్తావన వచ్చిందన్నారు. అందుకే హరిప్రసాద్‌ను మంగళూరు వెళ్ళి హిందూ, ముస్లిం ప్రముఖులతో చర్చలు జరిపి సమన్వయం తీసుకురావాలని సూచించానన్నారు. ఇటీవలే సుహాస్‌శెట్టి హత్య జరిగిందని రెండు రోజుల కిందట అబ్దుల్‌రహమాన్‌ను చంపారన్నారు. దక్షిణకన్నడ జిల్లాలో మతాల ఆధారంగా జరుగుతున్న ప్రతీకార హత్యలను ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. రెండు వర్గాల మధ్య ఎటువంటి ద్వేషం ఉండరాదని ఆదిశగా సమన్వయం తీసుకురావాలని సూచించానన్నారు. శుక్రవారం దాకా జిల్లా వ్యాప్తంగా నిషేదాజ్ఞలు అమలులో ఉన్నాయన్నారు. రాజకీయాలకు సంబంధించి పలు అంశాలపై మాట్లాడుకున్నామన్నారు. కాగా 2023 శాసనసభ ఎన్నికల వేళ ఉత్సాహంగా పనిచేసిన హరిప్రసాద్‌కు కేబినెట్‌లో చోటు లభించకపోవడంతో దాదాపు ఏడాది పాటు రాష్ట్ర పార్టీ నేతలకు వ్యతిరేకంగా వ్యవహరించారు. ఒకానొక దశలో నాయకత్వ మార్పు ఎలా చేయాలనేది తెలుసంటూ విమర్శించారు. తీవ్ర విమర్శలకు అధిష్ఠానం నుంచి నోటీసులు కూడా వచ్చాయి. ఇటీవల ఆరేడు నెలలుగా సమన్వయంగా ఉన్న బీకే హరిప్రసాద్ పార్టీ కలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.

చదువుకున్న పాఠశాలకు మంత్రి చేయూత

● దుస్థితిలో ఉన్న బడికి హైటెక్ సౌకర్యాలు కల్పించిన మంత్రి రామలింగారెడ్డి ● నేడు పునఃప్రారంభం

దొమ్మసంద్ర, మే 29(ఆంధ్రజ్యోతి): సాధారణంగా పుట్టిన ఊరు, చదువు నేర్చుకున్న పాఠశాల, బోధించిన ఉపాధ్యాయులను మరవరాదంటారు. అలాగే తాను చదువుకున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల దుస్థితిలో ఉందని తెలుసుకుని హైటెక్ సదుపాయాలు కల్పించారు రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి. ఆనేకల్ తాలూకా మరసూరు గ్రామపంచాయతీ పరిధిలోని శెట్టిహళ్ళిగ్రామంలో 1958-59లో మంత్రి రామలింగారెడ్డి ప్రాథమిక విద్య చదివారు. తాను చదివిన పాఠశాల పరిస్థితిపై ఆరా తీశారు. కొన్నేళ్లక్రితం పాఠశాల మూసేశారు. గ్రామస్థులు తమ పిల్లలను వేరే పాఠశాలలకు పంపుతున్నారు. గ్రామంలో ఓటింగ్‌కు కనీసం ఒక కేంద్రం కూడా లేదు. ఇలా విషయాన్ని తెలుసుకున్న ఆయన ప్రభుత్వపాఠశాలకు పునరుజ్జీవం తెచ్చేలా తన స్నేహితులతో కలసి సుమారు కోటిరూపాయల ఖర్చుతో భవనాన్ని ఆధునీకరించారు. ఈనెల 30న ఆధునీకరించుకున్న పాఠశాలను ప్రారంభించనున్నారు. ఇక్కడ స్మార్ట్ క్లాస్‌లు, ప్లే ఏరియా, కంప్యూటర్ తరగతులు, శౌచాలయం, వంటగది, ప్రార్థనా సభాంగణం, ఫర్నీచర్ తదితర సదుపాయాలు కల్పించారు. మంత్రి రామలింగారెడ్డి పాఠశాలను పరిశీలించి మాట్లాడుతూ విద్యాశాఖ ఉపాధ్యాయులను నియమిస్తుందన్నారు. అవసరమైతే తానే వ్యక్తిగతంగా ఉపాధ్యాయుల సౌకర్యాలను భరిస్తానన్నారు. తన క్లాస్‌మేట్స్‌తో కలసి పాఠశాలను పరిశీలించి చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకున్నారు.



పాఠశాలను పరిశీలిస్తున్న మంత్రి రామలింగారెడ్డి

రేపు పర్యావరణంపై జాగృతి



పోస్టర్లు విడుదల చేస్తున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు

మహదేవపుర, మే 29(ఆంధ్రజ్యోతి): ఆధునిక నగరీకరణ, వాహనాల సంఖ్య పెరగడం తద్వారా కాలుష్యం వల్ల కలుగుతున్న దుష్ప్రభావాలను అరికట్టడం, పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని రాష్ట్ర కాలుష్యనియంత్రణమండలి మహదేవపుర ప్రాంతీయ విభాగం అధికారి కేఎం రాజు అభిప్రాయపడ్డారు. బీబీఎంపీ జోనల్ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మనతోపాటు భావితరాలు ఆరోగ్యంగా ఉండేందుకు, మనుగడకోసం ప్రజలంతా పర్యావరణ పరిరక్షణకోసం ప్రామాణికంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. ఈనెల 31న ఉదయం 6గంటలనుంచి మధ్యాహ్నం 12వరకు మిడిత్ ఫౌండేషన్ సహకారంతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సైకిల్ థాన్ నిర్వహించనున్నామని, ఐటీపీఎల్ ప్రధాన రహదారి, మహదేవపుర డెకథ్లాన్ నుంచి కాడుగూడిలోని ట్రీ పార్క్ వరకు సుమారు 2.5 కిలోమీటర్లు పర్యావరణ అవగాహన నడక సాగుతుందన్నారు. పరిసర ప్రాంతాల్లో చెత్తా చెదారం పేరుకుపోకుండా చూసుకోవాలన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం పరుగు నిర్వహిస్తామని మిడిత్ ఫౌండేషన్ అధ్యక్షుడు మంజు తెలిపారు. సమావేశంలో కన్నడ జానపద పరిషత్ బెంగళూరు జిల్లా కార్యదర్శి డాక్టర్ వే అజిత్‌కుమార్, ఉపాధ్యాయురాలు సౌమ్య పవార్, సమాజసేవకుడు మంజయ్య చావడి తదితరులు పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాలని పౌరకార్మికుల డిమాండ్



పురసభ వద్ద నిరసన తెలుపుతున్న పౌర కార్మికులు

విజయపుర, మే 29(ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలో దినకూలీ ఆధారంగాను, అవుట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న పౌరకార్మికులను పర్మనెంట్ చేయాలని కోరుతూ నిరవధిక ధర్నా చేపట్టారు. గురువారం ఉదయం స్వచ్ఛతా పనులు చేపట్టాల్సిన పౌరకార్మికులు ఎలాంటి పనులు చేయకుండా పురసభ వద్ద గుమిగూడి నిరవధిక ధర్నాకు సిద్ధమయ్యారు. పౌరకార్మిక సంఘం అధ్యక్షుడు హెచ్ కృష్ణ మాట్లాడుతూ పట్టణాన్ని స్వచ్ఛంగా ఉంచడంలో కీలకంగా ఉండే పౌరకార్మికుల పట్ల మీనమేషాలు లెక్కించకుండా ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించి పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యజ్యోతి సంజీవిని పథకాన్ని అమలు చేయాలన్నారు. అన్ని వాహనాల డ్రైవర్‌లు, అవుట్‌సోర్సింగ్ పౌరకార్మికులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు ఆర్ లక్ష్మణ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని మహానగర పాలికె, నగర స్థానిక సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని పలుమార్లు విన్నవించినా స్పందించకపోవడంతో నిరవధిక ధర్నా చేపట్టామన్నారు. ధర్నాలో పురసభ ఉద్యోగులు కూడా పాల్గొన్నారు.

వివాహితను బావిలోకి తోసి..

ప్రియుడి ఆత్మహత్య

బెంగళూరు, మే 29(ఆంధ్రజ్యోతి): దక్షిణ కన్నడ జిల్లా మూడబిదరి తాలూకాలో వివాహితను బావిలోకి తోసి, ఆమె ప్రియుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతులను బడగమిజారు మరకడ అనే ప్రాంతానికి చెందిన సమీక్షా శెట్టి(29), పాటు ఆమె ప్రియుడు ప్రశాంత్(38)గా పోలీసులు గుర్తించారు. సమీక్షకు వివాహమై.. ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె భర్త పూణేలో ఉంటున్నారు. భర్తతో విభేదాల కారణంగా సమీక్ష పుట్టింట్లో ఉంటున్నారు. బాగల్‌కోటెకు చెందిన ప్రశాంత్‌కు ఇన్‌స్టాలో సమీక్ష పరిచయమైంది. మొదట స్నేహితులయ్యారు. ఆ తర్వాత ఫోన్ నంబర్లు మార్చుకుని ప్రేమికులుగా మారారు. సమీక్ష ఇంట్లో బుధవారం ఎవరూ లేని సమయంలో ప్రశాంత్ వచ్చాడు. ఏదో విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆగ్రహంతో ఇంటి పక్కనే ఉన్న బావిలోకి సమీక్షను తోసేశాడు. ఈ సంఘటనను ఆమె కుమారుడు చూశాడు. దీంతో తానే తోసేసినట్లు తెలిసిపోతుందనే భయంతో ప్రశాంత్ బావిలోకి దూకేశాడు. బాలుడు ఏడుస్తూ కనిపించడంతో స్థానికులు ఆరా తీశారు. విషయం తెలుసుకుని, పోలీసులకు, అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి ఇద్దరి మృతదేహాలను వెలికి తీశారు. మూడబిదరె పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రశాంత్‌కు ఇప్పటికే వివాహమైనట్లు పోలీసులు గుర్తించారు.

విక్రయదారుల సంఘం అధ్యక్షుడిగా తిమ్మనగౌడ



హెచ్ తిమ్మనగౌడను అభినందిస్తున్న రైతు సంఘాల నాయకులు

బళ్లారిరూరల్, మే 29(ఆంధ్రజ్యోతి) : బళ్లారి గ్రామీణ ప్రాంతాల రైతు సంఘం ఆధ్వర్యంలో సిద్దమ్మనహళ్లి, తిమ్మనగౌడను వ్యవసాయ పరికరాల విక్రేతల సంఘం అధ్యక్షుడిగా గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో ఈ అధ్యక్ష స్థానానికి గణపాత్ ఐనాథ రెడ్డి ఉన్నారు. ఈ రోజు తిమ్మనగౌడను తాలుకా అధ్యక్షుడు శివారెడ్డి, సండూరు తాలుకా అధ్యక్ష అవినాష్, కంప్లి అధ్యక్షుడు రాఘవేంద్ర రెడ్డి, సిరుగుప్ప అధ్యక్షులు మాధవయ్య, కురుగోడు తాలుకా అధ్యక్షులు శేఖరప్ప తదితరులు సిద్దమ్మనహళ్లి తిమ్మనగౌడను జిల్లా వ్యవసాయ పరికరాల విక్రయదారుల సంఘం అధ్యక్షుడిగా తాలుకా అధ్యక్షుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పలు గ్రామాల రైతులు, ఫర్టిలైజర్స్ యజమానులు ఘనంగా సత్కరించారు.

ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోండి

మడకశిర టౌన్, మే29(ఆంధ్రజ్యోతి): ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సంస్థ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని నీలకంఠాపురం గ్రామంలో త్వరలో ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన ఆసుపత్రిని ప్రారంభించనున్నారని, అందులో భాగంగా ఉద్యోగాల్లో ఎంపికైన వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ, ఇంటర్, జీఎన్ఎంతో చేసిన జూన్ 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కేసు పెడతారన్న భయంతో యువకుడి ఆత్మహత్య..!

● మృతదేహంతో బంధువుల ఆందోళన



బస్సు డిపో వద్ద మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు

రాయచూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌తో వాగ్వాదానికి దిగిన యువకుడు వారు తనపై కేసు పెడతారన్న భయంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటన గురువారం జిల్లాలోని లింగసుగూరు తాలూకా హనుకుంటి గ్రామంలో చోటు చేసుకుంది. హనుకుంటి గ్రామానికి చెందిన యువకుడు ముత్తణ్ణ(18) రోడ్డు పై నిలిచి ఉండగా అటుగా వెళ్లిన ఆర్టీసీ బస్సు వేగంతో బురద యువకుడి పై జల్లింది. దీంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌తో వాగ్వాదానికి దిగిన యువకుడు వారితో గొడవ పడ్డాడు. కోపంతో వారు కేసు పెడతామని బెదిరించి వెళ్లిపోయారు. వెనుదిరిగిన యువకుడు ఇంటికి వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహాన్ని తీసుకెళ్లి లింగసుగూరు బస్‌డిపో ముందు ఉంచి ఆందోళనకు దిగారు. సంఘటన పై లింగసుగూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న పోలీసు అధికారులు

రాయచూరు, మే 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన రహదారుల్లో ఉన్న దుకాణాల ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను అధికారులు విజయవంతంగా తొలగించారు. ఇందుకోసం చేపట్టిన స్పెషల్ డ్రైవ్ కార్యచరణను గురువారం యథావిధిగా కొనసాగించిన అధికారులు స్థానిక డీడీపీఐ కార్యాలయం నుంచి జాకిర్ హుసేన్ సర్కిల్, మహావీర్ సర్కిల్, హరిహర రోడ్డు, క్లథ్ బజార్, తీన్ ఖందిల్ చౌరస్తాల నుంచి చంద్రమౌళేశ్వర సర్కిల్ వరకుగల రోడ్ల పై ఉన్న ఫుట్‌పాత్‌లను తొలగింప చేశారు. ఈ సందర్భంగా పోలీసులను, మహానగర పాలిక సిబ్బందిని చూసిన వెంటనే కొంత మంది దుకాణదారులు తమ సామాన్లను స్వచ్ఛందంగా తొలించుకోగా మరికొన్ని చోట్ల అధికారులతో వాదనకు దిగే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా జోక్యం చేసుకున్న సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఉమేశ్ కాంబ్లె, తమ పరిధి వరకు ఉన్న స్థలంలోనే వ్యవహారాలు నడుపుకోవాలని ఏ ఇబ్బంది వచ్చినా తమను ఆశ్రయించవచ్చన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన డీఎస్పీ, పెరిగిపోతున్న ట్రాఫిక్ సంచారాన్ని అదుపు చేసే క్రమంలోనే ఆక్రమణల తొలగింపుకు శ్రీకారం చుట్టామన్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వారు స్వచ్ఛందంగా వాటిని తొలగించుకోవాలని లేదంటే సామానును సహితం జప్తు చేస్తామని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌కు మైనార్టీ నాయకుల రాజీనామా

● అబ్దుల్ రహీం హత్యపై ఆగ్రహం

బెంగళూరు, మే 29(ఆంధ్రజ్యోతి) : దక్షిణకన్నడ జిల్లా బంట్వాళ తాలూకాలో అబ్దుల్ రహీం దారుణహత్యను ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీకి చెందిన మైనార్టీ నాయకులు రాజీనామాలను ప్రకటించారు. గురువారం మధ్యాహ్నం బోళారలోని షాదీమహల్‌లో ప్రత్యేక సమావేశం జరిగింది. సమావేశంలో రహీం హత్యను తీవ్రంగా ఖండించారు. వరుసగా హత్యలు జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దలకు పట్టడం లేదని మండిపడ్డారు. మైనార్టీ విభాగం దక్షిణకన్నడ జిల్లా అధ్యక్షుడు శాహుల్ హమీద్ మాట్లాడుతూ సీఎం సిద్ధరామయ్య తీవ్రంగా పరిగణించారని వారం రోజులు గడువు ఇద్దామన్నారు. అంతలోనే కార్యకర్తలు ఇక్కడ అమాయకుల ప్రాణాలు పోతున్నాయని ఇంకా చర్చలు ఎందుకోసమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ గందరగోళంగా మారిపోయింది. అంతలోనే శాహుల్ హమీద్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కేపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎస్ మహమ్మద్, జిల్లాఉపాధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్‌తో పాటు మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించారు. సమస్య పరిష్కారం అయ్యేదాకా కాంగ్రెస్ కార్యాలయానికి వెళ్ళేది లేదని తేల్చి చెప్పారు. వందలాది మంది పార్టీ అభిమానులు, ముస్లిం యువకులు పాల్గొన్నారు

ఫ్లైఓవర్ లేక వాహనదారులకు ఇబ్బందులు

కంప్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని కొత్త దరోజీ వద్ద రైల్వే ట్రాక్‌పై ఫ్లైఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. గంగావతి, కంప్లి పరిధిలోని గ్రామాల్లో ప్రజలు బళ్లారికి రావాలన్న ప్రతి ఒక్క వాహనం దరోజీపైనే రావాల్సిందే రైల్వే ట్రాక్ వల్ల ఆస్పత్రికి వెళ్లే రోగులకు అత్యవసర వేళలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కావున కేంద్ర ప్రభుత్వం జిల్లా ఎంపీ పట్టణవాసుల్ని గ్రామ ప్రజల్ని ఇక్కడ పడుతున్న ఇబ్బందులను దృష్టిలో వుంచుకుని దరోజీ రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిను ఏర్పాటు చేసి ప్రయాణికులను ఎలాంటి సమస్యలు తలెత్తకుని చూడాలని కోరుతున్నారు. ప్రతి నిత్యం రైలు వచ్చే సమయంలో గేటు వేసిన సమయంలో ప్రయాణికులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.



నిలిచిన వాహనాలు



గుర్జాపూర్ వద్ద కృష్ణమ్మ పరవళ్లు

గుర్జాపూర్ బ్యారేజ్ గేట్ల ఎత్తివేత

● దిగువకు ప్రవహిస్తున్న కృష్ణానది నీరు

రాయచూరు, మే 29(ఆంధ్రజ్యోతి): రాయచూరు తాలూకాలోని గుర్జాపూర్ సమీపంలో కృష్ణనదిపై నిర్మించిన బ్యారేజ్ గేట్‌లను గురువారం అధికారులు ఎత్తేశారు. నది పరివాహక ప్రాంతంలో విస్తృతంగా కురుస్తున్న వర్షాలకు తోడు నారాయణపూర్ డ్యాం నుంచి దిగువకు నీటిని విడుదల చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో గుర్జాపూర్ వద్ద బ్యారేజ్ గేట్లను ఎత్తేశారు. కాగా ఆర్టీపీఎస్‌కు నీరందించేందుకు వీలుగా గుర్జాపూర్ వద్ద 1.5 టీఎంసీల సామర్థ్యంతో జలాశయాన్ని నిర్మించగా ఇప్పటికే ఆ జలాశయం పూర్తిస్థాయి నీటితో నిండిపోయింది.

నమ్మండి.. నగరమే..!

● వర్షాలకు కంకర తేలిన రహదారులు
● రోడ్ల దుస్థితిపై వాహనదారుల ఆగ్రహం



జాలహళ్ళి మెయిన్‌రోడ్డులో..

బెంగళూరు నగరంలో ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షాలకే రోడ్లు అతలాకుతలంగా మారాయి. కంకర తేలిన రహదారులతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల దుస్థితిపై నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే జాలహళ్ళి మెయిన్‌రోడ్డుతోపాటు కంఠీరవానగర్‌లో ప్రయాణించాలంటే జనాలకు గండం ఉన్నట్లే అనే పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా బెంగళూరు వ్యాప్తంగా కార్లు, ఇతర వాహనాల కంటే ద్విచక్రవాహనాలలో తిరిగి పనులు చేసుకునేవారే 70శాతం దాకా ఉంటారు. ఇలా జాలహళ్ళి ప్రాంతంలో రాత్రిపగలు తేడాలేకుండా వాహనాలు తిరుగుతుంటాయి. పగటి వేళలోనే ద్విచక్రవాహనాలలో తిరగాలంటే భయపడే పరిస్థితి ఎదురవుతోంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి రోడ్ల మరమ్మత్తులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ఆంధ్రజ్యోతి, బెంగళూరు




కంఠీరవానగర్‌లో..





ఇబ్బంది పడుతున్న వాహనదారులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1591.50	1,577.40
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	7,799	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	188	45
నీటి నిల్వ (టీఎంసీలు)	12.33	3.34



దుండగులు పగులగొట్టిన బీరువా

తాళం వేసిన ఇంట్లో చోరీ

కంప్లి, మే 29(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని ఎమ్మిగనూరు గ్రామంలో గురువారం అర్ధరాత్రి ఇటిగి రోడ్డులోని బాపూర్ బసవరెడ్డి ఇంట్లో దొంగతనం జరిగింది. తాళం పగులగొట్టి బంగారం, నగదు చోరీ చేశారు. కుటుంబ సభ్యులు పని నిమిత్తం బయటకు వెళ్లిన సమయంలో ఎవరు లేనిది గమనించి ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలో ఉన్న 2.5 తులాల బంగారం, 40 తులాల వెండి, రూ. 80 వేలు నగదు దొంగతనం చేపట్టారు. ఉదయం ఇంటికి రాగానే తలుపులు పగులగొట్టిన దృశ్యాలు, ఇంటిలోని బీరువా పగులగొట్టిన దృశ్యాలు కనిపించడంతో వెంటనే బసవరెడ్డి, కురుగోడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తామన్నారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ఇకపై బయటికి వెళ్లేవారు జాగ్రత్తగా వెళ్లాలని, ఇరుగు పొరుగువారికి తెలియజేయడం ఉత్తమమన్నారు.

బయటపడ్డ శిలాశాసనం



వేదరాజు మఠంలో బయటపడ్డ శిలాశాసనం

కంప్లి, మే 29 (ఆంధ్ర జ్యోతి): హరప్పనహళ్లి పట్టణంలో బుధవారం వాదిరాజ మఠం ప్రాంగణంలో తవ్వకాల్లో శిలాశాసనం బయటపడింది. జోంయిసకేరిలోని వాదిరాజ మఠం బృందావనం వెనుక 13వ శతాబ్దపు దాన శిలాశాసనం బయటపడటంతో పరిశోధకులు వీణా మహతేష్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. శిలాశాసనంలో ఏడు కన్నడ లిపిలో ఉన్నాయని పరిశోధకులు తెలిపారు. ఈ శిలాశాసనంలో కృష్ణ శిలలోని వృత్తాకార పాణిపీఠంలో తాబేలు చిత్రం వుందన్నారు. రెండున్నర అడుగుల ఎత్తు వుంటుంది. ముందు గోడపై ఒక యతి చిత్రం కూడా తెలిపారు. ఈ శిలను వాదిరాజ్ మఠం ఉంచుతామని స్థానికులు తెలిపారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

● అధ్వాన స్థితిలో పలు తరగతి గదులు ● మరమ్మతులపై దృష్టిపెట్టని అధికారులు ● ఏఐడీఎస్ నిరసన

బళ్లారి సిటీ, మే29(ఆంధ్రజ్యోతి): నగరంలోని వడ్డరగెర, బోయగేరి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో గురువారం డీడీపీఐ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఏఐడీఎస్ఓ జిల్లాధ్యక్షుడు ఈరన్న మాట్లాడుతూ నగరంలోని వడ్డరగెరెలోని ప్రభుత్వ లోయర్ ప్రైమరీ స్కూల్, బోయగేరిలోని ప్రభుత్వ ఉర్దూ లోయర్ ప్రైమరీ పాఠశాలల్లో పలు మౌలికసౌకర్యాలు లోపించాయన్నారు. ఈప్రాంతాల్లో ప్రజలు చాలా మంది తమ పిల్లల విద్య కోసం ప్రభుత్వ పాఠశాలలపై ఆధారపడుతున్నారు. బోయగేరి ప్రభుత్వ ఉర్దూ లోయర్ ప్రైమరీ పాఠశాల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. తక్షణం మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల భవనం కూలిపోయే దుస్థితిలో ఉందన్నారు. వర్షాకాలంలో పాఠశాల ప్రాంగణంలో నీరు నిలిచిపోయి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, దీంతో తరగతులకు అంతరాయం కలుగుతోందన్నారు. పాఠశాలలో శుభ్రమైన తాగునీటి వ్యవస్థ లేదు, మరుగుదొడ్లు కూడా చాలా దారుణంగా ఉన్నాయి. ఇది పిల్లలకు అనారోగ్యకరంగా మారిందన్నారు. తోడు వడ్డగేరి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. దీనివల్ల ప్రతిరోజు ఎనిమిది తరగతులు తీసుకోవడం అసాధ్యంగా మారిందన్నారు. ఉపాధ్యాయులు జనగణన, కులగణనకు వెళ్తుండంతో తరగతులకు అవరోధం కలుగుతోందన్నారు. అదనంగా ఈ రెండు పాఠశాలలకు 3 కి.మీ. పరిధిలో ఎక్కువ ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలలు ప్రభుత్వ పాఠశాలలు ప్రభుత్వ పాఠశాలకు రావాల్సిన విద్యార్థులను ఆకర్షించాలని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన డీడీపీఐ మాట్లాడుతూ నగరంలోని వడ్డరగేరిప్రభుత్వ లోయర్ ప్రైమరీ స్కూల్, బోయగేరి ప్రభుత్వ ఉర్దూ లోయర్ ప్రైమరీస్కూల్‌లను కాపాడి, అభివృద్ధిచేసి, విద్యార్థుల సంఖ్యను పెంచేలా తల్లిదండ్రులను ఒప్పించడానికి ప్రయత్నిస్తామని హామీఇచ్చారు. మరమ్మతులు చేపట్టి, ఇంగ్లీష్ మీడియం బోధనకు ప్రయత్నిస్తామన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వం పాఠశాలలకు పంపాలన్నారు.



డీడీపీఐ కార్యాలయం ఎదుట ఏఐడీఎస్ఓ కార్యకర్తల నిరసన



కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

బళ్లారి సిటీ, మే 29(ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి గురువారం పరిశీలించారు. గడిగ చెన్నప్ప సర్కిల్ నుంచి ఇందిరా సర్కిల్ వరకు ఉన్న రోడ్డు, రౌండ్‌అబౌట్, గడిగ చెన్నప్ప సర్కిల్ నుంచి ఈడిగ హాస్టల్ వరకు ఉన్న రోడ్డు, ఫ్యాయింగ్ గ్యాలరీ పనులను ఆయన పరిశీలించారు. ఏపీఎంసీ నుంచి గవియప్ప సర్కిల్ వరకు రోడ్డు విస్తరణ, సుందరీకరణ పనులను కూడా పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో ప్రజాపనుల శాఖ అధికారులు ఈఈ హేమరాజ్, ఏఈఈ సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ ఈఈ గోవర్ధన్, మున్సిపల్ కార్పొరేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కమల్‌హాసన్ వాఖ్యలపై కరవే నిరసన



కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న కరవే పదాధికారులు

బళ్లారిరూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): తమిళ చిత్ర నటుడు కమల్‌హాసన్ వివాదాస్పద వ్యాఖ్యలకు వ్యతిరేకంగా కర్ణాటక రక్షణ వేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నగరంలో గురువారం ఉదయం కర్ణాటక రక్షణ వేదిక నివేదిక రాజ్య సంచాలకుడు అర్ధగిరి రామన్న, జిల్లా అధ్యక్షుడు ఉలిగప్ప నేతృత్వంలో తమిళ చిత్ర నటుడు కమల్‌హాసన్ పై తక్షణం చర్యలు తీసుకోవాలని వారి మాటలను వ్యతిరేకిస్తూ కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక రక్షణ వేదిక రాష్ట్ర సంచాలకుడు రామన్న, జిల్లా అధ్యక్షులు ఉలిగప్ప, వీరారెడ్డి, వెంకటేష్, ఆనంద్, రామాంజిని, పలువురు పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

● డీఎస్పీ ప్రసాద్ గోఖలే



కంప్లి, మే 29(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తోరణగల్లు విభాగం డీఎస్పీ ప్రసాద్ గోఖలే తెలిపారు. గురువారం డీఎస్పీ విలేఖరులతో మాట్లాడుతూ జిల్లాలో రోజురోజుకి ద్విచక్రవాహనదారులు ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకోవడంతో వాటిని దృష్టిలో వుంచుకుని పోలీసుశాఖ నిర్ణయం తీసుకుందన్నారు. ప్రతి ఒక్క ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. ఎంతోమంది ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదంలో హెల్మెట్ లేక ప్రమాదంలో జరిగిన సమయంలో తలకు బలమైన గాయాలవడంతో ఎంతోమంది మృతి చెందారు. వీటితో పాటు ద్విచక్రవాహనదారులు లైసెన్స్ తప్పనిసరిగా వుండాలని, రోడ్డు నియమాలు పాటించినప్పుడే కొంతవరకు ప్రమాదాన్ని అడ్డుకోవచ్చునన్నారు. రోడ్డుపై ప్రయాణం చేపట్టే ద్విచక్ర వాహనదారులు వారితో పాటు వెనుకభాగంలో కూర్చునే వారికి కూడా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. లేకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థులకు ఆహ్వానం



విద్యార్థులను ఆహ్వానిస్తున్న ఉపాధ్యాయులు

సిరుగుప్ప, మే 29 (ఆంధ్రజ్యోతి) : పిల్లలను తప్పనిసరిగా బడికి పంపాలని ఒడ్డు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ముఖ్య ఉపాధ్యాయుని పర్వీన్ బేగమ్ పిలుపునిచ్చారు. గురువారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు ప్రారంభించడంతో ఆమె బడికి రావాలని పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. విద్యార్థుల భవిష్యత్తు వారి విద్యాభ్యాసంపై ఆధారపడి వుంటుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసి అభివృద్ధిబాటలో నడవాలన్నారు. ఈ సందర్భంగా సాక్షరత సమితి అబ్దుల్‌నబీ, ఉపాధ్యాయులకు పిల్లలకు పూలు ఇస్తూ పాఠశాలలోకి ఆహ్వానించారు.

దేవదాసీల సమస్యలు పరిష్కరించండి

● తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన

సిరుగుప్ప, మే 29(ఆంధ్రజ్యోతి) : దేవదాసీలకు నెలసరి రూ. ఆరు వేలు పింఛన్ ఇవ్వాలని దేవదాసీల సంఘం తాలుకా కన్వీనర్ అడివప్ప కోరారు. గురువారం సిరుగుప్ప పట్టణంలో దేవదాసీల డిమాండ్ల పరిష్కారం కోసం హైస్కూలు గ్రౌండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ సిద్దార్థకు వినతి పత్రం అందజేశారు. దేవదాసీలకు ప్రతి ఒక్కరికి రెండు ఎకరాల భూమిని కేటాయించాలని కోరారు. దేవదాసీల పిల్లలు వివాహం చేసుకుంటే రూ. 5 లక్షలు ప్రోత్సాహక ధనం కల్పించాలని, ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యాప్రగతికి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. దేవదాసీల సమస్యల కోసం ఎన్నో పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. దేవదాసీల సంఘం అధ్యక్షుడు ఉలిగమ్మ, కార్యదర్శి నాగరాజు, దేవదాసీలు పాల్గొన్నారు.

1న లింగాయత్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



మాట్లాడుతున్న వీరశైవ నాయకులు చన్నబసయ్యస్వామి, బసవరాజ్

బళ్లారి సిటీ, మే 29(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర వీరశైవ లింగాయత్ ఉద్యోగుల సంక్షేమ అభివృద్ధి సంఘం జూన్ 1న నగర శివారులోని అల్లీపుర మహాదేవతాత మఠంలో 2024-25 సంవత్సరంలో 85శాతం కంటే ఎక్కువ మార్కులు సాదించిన పదవతరగతి, పీయూసీ,(ఇంటర్) విద్యార్థులకు ప్రతిభా పురస్కార్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంఘం గౌరవాధ్యక్షుడు చన్నబసయ్యస్వామి , ప్రధాన కార్యదర్శి బసవరాజ్ బిసలహళ్ళి తెలిపారు. గురువారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈసంవత్సరం 130 మంది పదవతరగతి విద్యార్థులకు, 130మంది ద్వితీయ పీయూసీ విద్యార్థులకు అవార్డులు అందజేస్తామన్నారు. విద్యార్థుల ప్రతిభా పురస్కారాలు వివిధ వీరశైవ నాయకులు, బళ్లారిలోని గణ్యాతిథులు, విద్యా సంస్థల పాలక మండళ్ల సభ్యులు, సంఘం పెద్దల సమక్షంలో జరుగుతాయన్నారు. ప్రతిభా పురస్కార కార్యక్రమం అనంతరం పదవ తరగతి తర్వాత చేయాల్సిన కోర్సులు, ఉద్యోగావకాశాలపై అసోసియేషన్ సభ్యులు నగేశ్ పాటిల్ డాక్టర్ జగదీశ్ ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు.

జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, మే 29(ఆంధ్రజ్యోతి): తాలుకాలో జొన్నలు పండించిన రైతన్నలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గణేష్ కోరారు. గురువారం మార్కెట్ యార్డులో జొన్నలు కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కంప్లి నియోజకవర్గంలో మూడు చోట్ల జొన్నలు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఒకటి కంప్లి రెండోది ఎమ్మిగనూరు మూడవది కురుగోడు ఈ మూడు చోట్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో రైతన్నలకు అనుకూలించిందన్నారు. ఇప్పటికే రైతులు తమ పేర్లు నమోదు చేసుకుని అమ్మకాలు కూడా చేపడుతున్నారని తెలిపారు. ఒక క్వింటాల్‌కు ప్రభుత్వం రూ.3337 ఇస్తుందన్నారు. కంప్లి కేంద్రంలో 113 రైతులు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షులు బట్టా ప్రసాద్ వీరేష్ భాస్కర్‌రెడ్డి హబీబుర్ రెహ్మాన్, శరణగౌడ, లింగప్ప, సత్యప్ప, విజయ్ కుమార్, వన్నూరు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

ఎంజీఆర్ మార్కెట్ ప్రారంభం

● వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం లాంఛనం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మేయర్ సత్య

హోసూరు, మే 29(ఆంధ్రజ్యోతి): హోసూరులో రూ.9.86 కోట్లతో నిర్మించిన ఎంజీఆర్ మార్కెట్, చేపల దుకాణాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి స్టాలిన్ చెన్నైలోని సచివాలయం నుంచి ప్రారంభించారు. ఎంజీఆర్ మార్కెట్‌లో 158 దుకాణాలు, ఇంకా 48 చేపల దుకాణాలు ఏర్పాటు చేశారు. గురువారం హోసూరు మేయర్ సత్య, కార్పొరేషన్ కమిషనర్ మారిసెల్వి జ్యోతిప్రజ్వలనతో మార్కెట్‌ను ప్రారంభించారు. కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అందరికీ మిఠాయిలు పంపిణీ చేస్తూ మార్కెట్ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని మేయర్ పిలుపునిచ్చారు.

డీఎంకేలోకి పలువురి చేరిక



కార్యకర్తలతో ఎమ్మెల్యే మతియజగన్

కృష్ణగిరి రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రమైన కృష్ణగిరిలో ఏర్పాటైన కార్యక్రమంలో డీఎంకేలోకి పలువురు చేరారు. కృష్ణగిరి పంచాయతీ యూనియన్ ఆకాశపల్లికి చెందిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాయి అర్జునన్, వీవర్స్ యూనిట్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు రాజేంద్రన్‌లు బీజేపీని వీడి డీఎంకేలోకి చేరారు. కృష్ణగిరి నగర మాజీ ఇన్‌చార్జ్ దుబెల్, ఇతర పార్టీలకు చెందిన 22మంది ఈ సందర్భంగా డీఎంకేలోకి చేరారు. కృష్ణగిరి తూర్పు జిల్లా డీఎంకే కార్యదర్శి, ఎమ్మెల్యే యధియజగన్ వారిని ఆత్మీయంగా పార్టీ కండువాతో స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ గత నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు డీఎంకేలోకి చేరుతున్నారన్నారు. 2026 శాసనసభ ఎన్నికల్లో డీఎంకే మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రూ.75 లక్షల పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



భూమిపూజ చేస్తున్న తళి ఎమ్మెల్యే రామచంద్రన్

హోసూరు, మే 29(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా తళి వాసనసభ నియోజకవర్గం పరిధిలోని బైరమంగలం, గుంటుమారనపల్లి పంచాయతీ ప్రాంతాల అభివృద్ధికి రూ.75లక్షలను నియోజకవర్గ ప్రాంతీయ అభివృద్ధి నిధులు కేటాయించారు. ఎమ్మెల్యే డీ రామచంద్రన్ గురువారం లాంఛనంగా భూమిపూజ చేశారు. బైరమంగలం గ్రామం పరిధిలో రూ.19లక్షలతో సిమెంటు రోడ్డు, కారుకొండపల్లి ఆలయం వద్ద రూ.5లక్షలతో సిమెంటు రోడ్డు, మాతవరం అగ్రహారలో రూ.16లక్షలతో భవనం ఇతరత్రా పనులు చేపట్టనున్నారు. ఎమ్మెల్యేకు గ్రామస్థులు సాదరస్వాగతం పలికారు. ఇదే సందర్భంగా స్థానికుల సమస్యలను ఆలకించారు. సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఇదే సందర్భంగా పలు గ్రామాలలో తారు రోడ్డు, సిమెంటు రోడ్డు పనులతోపాటు డ్రైనేజీ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి బాలాజి, కౌన్సిల్ మాజీ సభ్యుడు ప్రశాంత్, పంచాయతీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసన్, సీపీఐ జిల్లా ప్రతినిధి జయరామన్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకలితో ఎవ్వరూ ఇబ్బంది పడరాదు

● వరల్డ్ హంగర్‌డేను పురస్కరించుకుని విక్టరీ పార్టీ వెయ్యి మందికి అన్నదానం

హోసూరు, మే 29(ఆంధ్రజ్యోతి): ఆకలి కారణంగా ఎవరూ ఇబ్బంది పడరాదని, ఇందుకోసం శ్రీమంతులు, ఇతర సంస్థలు చేయూత అందించాలని విక్టరీ పార్టీ నాయకులు అభిప్రాయపడ్డారు. వరల్డ్ హంగర్ డేను పురస్కరించుకుని వేపనహళ్ళిలో పార్టీ ఆధ్వర్యంలో సుమారు వెయ్యిమందికి భోజనం అందించారు. పార్టీ వేపనహళ్ళి యూనియన్ కార్యదర్శి నాగరాజ్ మాట్లాడుతూ ఆధునికంగా ఎంత అభివృద్ధి చెందినా బస్టాండ్, రైల్వేస్టేషన్, ఇతర ప్రాంతాలలో నిరుపేదలు ఆకలితో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ దుస్థితిని తగ్గించడానికి పార్టీ అధ్యక్షుడు విజయ్ ప్రత్యేక కార్యాచరణ నిర్వహించదలిచారన్నారు. ప్రపంచ ఆకలి దినోత్సవం రోజున తమిళనాడులోని 234 శాసనసభ నియోజకవర్గాలలో మధ్యాహ్నం భోజనం సమకూరుస్తామని ప్రకటనలో పేర్కొన్నారన్నారు. ఈ మేరకు వేపనహళ్ళి బస్టాండ్ సమీపాన జిల్లా నాయకులతో కలసి కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా అమ్రిష్, అనోస్, జగదీశ్, సత్తివేల్, జినోత్, మయిల్సామ్, మురుగేశన్, తదితరులు పాల్గొన్నారు.



ఆహారం అందజేస్తున్న విక్టరీ పార్టీ నాయకులు

మత సామరస్యానికి ప్రతీక కువెంపు సాహిత్యం

● 'కువెంపు సాహిత్యంలో భావజాలం' సదస్సులో వక్తలు



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వెస్ చాన్స్‌లర్ మునిరాజు

బళ్లారి సిటీ, మే 29(ఆంధ్రజ్యోతి): కువెంపు సాహిత్యంలో సర్వోదయ తత్వశాస్త్రం ఉందని, అది అన్ని మతాలకు సమాన హక్కులు కల్పించాల్సిన అవసరం చాటి చెప్పిందని ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ మహిళా కళాశాల కన్నడ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కొట్రేశ్ అన్నారు. గురువారం విజయనగరం శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం కన్నడ సాహిత్య పరిషత్ బళ్లారి జిల్లా యూనిట్, విజయనగర శ్రీ కృష్ణదేవరాయ కన్నడ అధ్యయన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 'కువెంపు సాహిత్యంలో భావజాలం' ఉపన్యాస కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కువెంపు సాహిత్యంలో సైన్స్ మతం అనేవి భావజాలాలు మానవ మతం యొక్క సామరస్యం, సార్వత్రిక మార్గం, సర్వోదయ యొక్క పూర్తి దృష్టి కువెంపు సాహిత్యం ద్వారా అందించారన్నారు. వీటిని గ్రహించడం ద్వారా కన్నడ సాహిత్యం ఎంతగా పెరుగతోందో అంతగా సుసపంపన్నం అవుతుందన్నారు. కన్నడ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నిష్టిరుద్రప్ప మాట్లాడుతూ కన్నడ సాహిత్య పరిషత్‌కు అనేక సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. అఖిల భారత సదస్సు కన్నడ సాహిత్యాన్ని స్మరించుకునేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి(వైస్ చాన్స్‌లర్) మునిరాజు మాట్లాడుతూ కువెంపు ఏ అధికార పదవినీ ఆశించలేదన్నారు. విద్యార్థులు వారిలాంటి దృక్పథాన్ని పెంపోందించుకోవాలన్నారు. హైదరాబాద్ కర్ణాటకోని తల్లిదండ్రులు తమ పిల్లల చదువుకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. రాబోయే రోజుల్లో తిరుపాలప్ప స్మారక కన్నడ భవనాన్ని నిర్మిస్తానని ఆయన అన్నారు. ఈ సందర్భంగా వేదికపై వెంకటేశ్ హెగ్డే, జయప్రకాశ్, ప్రొపేసర్ శాంతినాయక్, రాబర్ట్‌జోష్, సంతోష్ వేదికపైఉన్నారు. కన్నడ అధ్యయన విభాగంలో లెక్చరర్ అయిన శివప్రకాశ్, రంగనాథ్, వివిధ విభాగాల అదిపతులు, సమన్వయకర్తలు, లెక్చరర్లు. పరిశోధనా విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.